ప్రజాశక్తి
సోమవారం 8 డిసెంబర్ 2025
5
విజయనగరం



13, 14న జెఎన్‌టియులో
'జెన్‌ఎఐ హ్యాక్‌థాన్ ఫర్ నెక్స్ట్ జనరేషన్ జాబ్స్'

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

జెఎన్‌టియుజివి, జెన్ యూనివర్సిటీ సంయుక్త ఆధ్వర్యాన ఈ నెల 13, 14వ తేదీల్లో జెన్‌ఎఐ హ్యాక్‌థాన్ ఫర్ నెక్స్ట్ జనరేషన్ జాబ్స్ పేరుతో పోటీలు నిర్వహిస్తున్నట్లు జెఎన్‌టియుజివి వైస్ ఛాన్సలర్ వి.వి.సుబ్బారావు ఒక ప్రకటనలో తెలిపారు. జనరేటివ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రంగంలో విద్యార్థుల నైపుణ్యాలను పెంపొందించేందుకు హైదరాబాద్‌కు చెందిన జెన్ యూనివర్సిటీతో కలిసి జెఎన్‌టియు క్యాంపస్‌లో ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. విజేతలకు రూ.లక్ష విలువైన బహుమతులు అందజేస్తామని తెలిపారు.

ఈ ఏడాది కూడా ధాన్యం రైతులను మిల్లర్లు దోచుకుంటున్నారు. మిల్లర్ల ఆగడాలు అరికట్టే విధంగా రైతులకు, మిల్లర్లకు సంబంధం లేకుండా చేసి, పండించిన ప్రతి ధాన్యపు గింజా కొంటామని, రైతులు మిల్లర్లకు అదనంగా ఒక్క కేజీ కూడా ఇవ్వాల్సిన పని లేదని ప్రభుత్వ పెద్దలతోపాటు అధికారులు చెప్పినా, ఆచరణలో అదనపు ధాన్యం బెడద వెంటాడుతోంది. కస్టోడియన్ అధికారులే దగ్గరుండి చూసుకోవాలని ఉన్నతాధికారులు చెబుతున్నా, క్షేత్ర స్థాయిలో వారి జాడ కనిపించడం లేదు. ఫలితంగా మిల్లర్లు రైతులతో బేరసారాలు పెట్టి, క్వింటాకు 5 నుంచి 10 కిలోలు అదనపు ధాన్యాన్ని గుంజుతున్నారు. తాజాగా జరిగిన డిఆర్‌సిలో జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి ఈ విషయమై ప్రస్తావించడం గమనార్హం. ఎవరైనా అదనపు ధాన్యం తీసుకుంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించినా పరిస్థితి యథాతథంగానే ఉంది.

– ప్రజాశక్తి, డెంకాడ, బొబ్బిలి, జామి



డెంకాడ.. గోనె సంచులు లేక కళ్లాల్లో ఆరబెట్టిన ధాన్యం

ధాన్యం రైతులను దోచేస్తున్నారు

- క్వింటాకు 5 నుంచి 10 కిలోలు డిమాండ్
- గోనె సంచులు లేక గగ్గోలు
- కానరాని కస్టోడియన్ అధికారులు
- ఆందోళనలో అన్నదాతలు

జిల్లాలో ఈ ఏడాది సుమారు 2.80 లక్షల ఎకరాల్లో వరి సాగైంది. 4 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేశారు. అదే స్థాయిలో పంట పండింది. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా కొనుగోళ్లు ప్రారంభమయ్యాయి. ఈ ఏడాదైనా కొనుగోలు దోపిడీ ఆగుతుందని భావించిన రైతులకు ఆడియాశలే మిగిలాయి. రైతు సేవా కేంద్రాల్లో ట్రక్ షీట్ జనరేట్ అయ్యాక, ఎఫ్‌టిఒ (రవాణకు అనుమతి) తీసుకొని మిల్లుకు వెళితే, అక్కడ ధాన్యం దించి, ఎక్నాలెడ్జ్‌మెంట్ చేస్తే 24 గంటల్లో రైతు ఖాతాలో డబ్బులు పడాలి. ఈ వ్యవహారమంతా మిల్లుల వద్ద కస్టోడియన్ అధికారిలే దగ్గరుండి చూసుకోవాలి. కానీ జిల్లాలో ఎక్కడా కస్టోడియన్ అధికారులు కానరావడం లేదు.

జామి మండలంలో 15 వేల టన్నులు కొనుగోలు లక్ష్యం కాగా, ఇప్పటి వరకు దాదాపు 1800 మెట్రిక్ టన్నులు కొనుగోలు జరిగినట్లు అధికారులు చెబుతున్నారు. కానీ ఉన్నతాధికారులు చెబుతున్న కస్టోడియన్ అధికారులు ఎక్కడా కానరావడం లేదని రైతులు వాపోతున్నారు. జామి గ్రామానికి చెందిన చలుమూరి మహేష్ అనే రైతు 60 మెట్రిక్ టన్నులను గంట్యాడ మండలం శ్రీలక్ష్మీ వెంకటేశ్వర మోడరన్ రైస్‌మిల్లుకు తీసుకెళ్లగా, మూడు రోజులు కావస్తున్నా, నేటికీ మిల్లర్లు ఎక్నాలెడ్జ్ చేయకపోగా, రైతును మిల్లు యజమానితో మాట్లాడుకోవాలని ఒత్తిడి తెస్తున్న పరిస్థితి. దాదాపుగా కొనుగోళ్లలో ఇదే జరుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై జామి సిఎస్ డిటి మూర్తిని 'ప్రజాశక్తి' వివరణ కోరగా, జిల్లాలో మిల్లుల వద్ద సాంకేతిక లోపం కారణంగా, ఎక్నాలెడ్జ్ చేయడంలో కొంత జాప్యం జరుగుతుందని, అయినప్పటికీ సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నామని చెప్పారు.

మిల్లరుతో మాట్లాడితేనే తూకం వేస్తారట



నేను జామి నుంచి ఈ నెల రెండో తేదిన శ్రీలక్ష్మి వెంకటేశ్వర మోడరన్ రైస్ మిల్లుకు ధాన్యం తీసుకెళ్లాను. కాటా స్లిప్ ఇవ్వలేదు. ఇప్పటికీ నాలుగు రోజులవుతున్నా తూకం వేసి నాకు రశీదు ఇవ్వలేదు. మిల్లరుతో మాట్లాడుకోవాలని ఫోన్లు వస్తున్నాయి.

– సిహెచ్ మహేష్, రైతు, జామి

కలెక్టర్‌కి ఫిర్యాదు చేస్తాం



మిల్లర్లు అదనపు ధాన్యాన్ని డిమాండ్ చేస్తున్న వ్యవహారంపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తాం. ధాన్యం కొనుగోలుపై చర్యలు తీసుకుని దోపిడీని అరికట్టే విధంగా అదేశాలు జారీ చేయాలి. లేకుంటే రైతులను సమీకరించి, మిల్లర్ల దోపిడీపై ఉద్యమిస్తాం.

– బుద్ధరాజు రాంబాబు, ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి

క్వింటాకు 10 కిలోలు అదనం

బొబ్బిలి నియోజకవర్గంలో మిల్లర్లు ధాన్యం రైతులను నిలువునా దోపిడీ చేస్తున్నారు. ధాన్యం మిల్లింగ్ చేస్తే బియ్యం ముక్కలు అవుతున్నాయని సాకుగా చూపి మిల్లర్లు రైతులను దోపిడీ చేస్తున్నారు. క్వింటా ధాన్యానికి 10 కిలోల వరకు అదనంగా ఇస్తేనే రైతులు నుంచి సేకరిస్తున్నారు. రైతు సేవా కేంద్రంలో ట్రక్ షీక్ తీసుకుని మిల్లుకు ధాన్యం తీసుకుని వెళ్లిన రైతులు తిరిగి వెనక్కి రాలేక, మిల్లర్లు అడిగిన ధాన్యం అదనంగా ఇవ్వాల్సిన పరిస్థితి ఏర్పడింది. బొబ్బిలి మండలంలోని కింతలివానిపేట, కోమటిపల్లి, కలవరాయి మిల్లులకు ధాన్యం తరలిస్తే క్వింటాకు 10 కిలోల వరకు అదనంగా ధాన్యం తీసుకుంటున్నట్లు రైతులు ఆరోపిస్తున్నారు. నియోజకవర్గంలో బొబ్బిలి మండలం దిబ్బగుడ్డివలస, బాడంగి మండలం పినపెంకి రైసుమిల్లులు మినహా మిగిలిన మిల్లర్లు ధాన్యం అదనంగా తీసుకుంటున్నట్లు రైతులు వాపోతున్నారు.


బొబ్బిలి.. కళ్లంలో నెట్టువేసి భద్రపరిచిన ధాన్యం

గోనె సంచులకూ తిప్పలు

జిల్లాలో ధాన్యం సంచుల కొరత వెంటాడుతోంది. మార్కెట్‌లో సంచులు కొనుక్కొని ధాన్యం తెస్తేనే కొనుగోలు చేస్తామని మిల్లర్లు చెప్పడంతో రైతులకు దిక్కుతోచడం లేదు. మరోవైపు తేమశాతం పేరుతో అదనపు ధాన్యం తీసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో రైతులు ధాన్యాన్ని పొలాల్లో ఎండబెట్టుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. గతంలో కొనుగోలు కేంద్రాల ద్వారా మిల్లర్ల ద్వారా రైతులకు గోనె సంచులు సరఫరా చేసేవారు. తాజాగా సంచులు పంపిణీ చేయకపోవడంతో సంచులు లేక రైతులు ధాన్యం తరలించేందుకు ఇబ్బంది పడుతున్నారు. సంచుల కోసం అధికారులు, మిల్లర్ల చుట్టూ తిరిగినా ప్రయోజనం లేకుండా పోతుందని రైతుల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మార్కెట్‌లో 80 కిలోల సంచి రూ.10 నుంచి 15 వరకు ఉంది. ప్రభుత్వం మాత్రం 80 కిలోల సంచులైనా 40 కేజీల గోనె సంచికి మాత్రమే రూ.4 ఇస్తుంది. దీంతో రైతు ఒక సంచి దగ్గర పది రూపాయల వరకు నష్టపోవాల్సి వస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డెంకాడ మండలం పినతాడివాడ గ్రామానికి చెందిన ఒక రైతు గోనె సంచుల కోసం ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేయగా ఆ రైతుకు గోనెలు ఇవ్వడం కష్టమని, కొనుక్కో వాలని అధికారులు సమాధానం చెప్పారు.


గోనె సంచులు ఏర్పాటు చేయాలి



కష్టపడి తుపాన్లకు, వర్షాలకు తట్టుకొని పంటను పండించాం. పండిన ధాన్యాన్ని ఇంటికి తీసుకువచ్చి వాటిని అమ్ముకోవడానికి, మిల్లర్లకు పంపించేందుకు సంచులు లేక ఇబ్బందులు పడుతున్నాం. ప్రభుత్వమే గోనె సంచులను ఏర్పాటు చేస్తే ఉపయోగకరంగా ఉంటుంది.

– కలిశెట్టి నారాయణరావు, గొడ్డుపాలెం, డెంకాడ మండలం

సంచులు కొనుక్కోవాల్సి వస్తుంది



ధాన్యాన్ని మిల్లర్లకు పంపించాలంటే సంచులు కొనుక్కోవాల్సి వస్తుంది. మార్కెట్‌లో ఒక సంచి రూ.10 నుంచి 15 ఖరీదు ఉంది. ప్రభుత్వం మాత్రం సంచికి నాలుగు రూపాయలు ఇస్తుంది. మేము పది రూపాయల నష్టపోవాల్సి వస్తుంది.

–పప్పల నర్సింగరావు, గొడ్డుపాలెం, డెంకాడ మండలం

గోనె సంచులు సరఫరా చేస్తున్నాం

మండలంలో ధాన్యం అమ్ముతున్న రైతులందరికీ గోనెలు సరఫరా చేస్తున్నాం. మండలంలో రెండు మిల్లులకు ధాన్యం కొనుగోలు చేసేందుకు ప్రస్తుతం ప్రభుత్వం పర్మిషన్ ఇచ్చింది. 49 వేల సంచులకు ప్రతిపాదనలు పంపగా, ఇప్పటివరకు 38 వేలు రైతులకు సరఫరా చేశాం. బయట కొనుక్కున్న రైతులకు ప్రభుత్వం 40 కేజీల సంచికి మాత్రమే నాలుగు రూపాయలు ఇస్తుంది. 80 కేజీల సంచులకు డబ్బులు ఇవ్వదు.

– శంకర్రావు, సిఎస్ డిటి, డెంకాడ

---

31 నుంచి జనవరి 4 వరకు
సిఐటియు జాతీయ మహాసభ

- 27 నుంచి సాంస్కృతిక ఉత్సవాలు
- 4న భారీ బహిరంగ సభ
- విజయవంతం చేయాలి
- సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు ఎ.వి.నాగేశ్వరరావు పిలుపు


సిఐటియు జాతీయ మహాసభ వాల్‌పోస్టర్‌ను రాష్ట్ర అధ్యక్షులు ఎ.వి.నాగేశ్వరరావు, జిల్లా నాయకులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఈ నెల 31 నుంచి జనవరి నాలుగో తేదీ వరకు విశాఖపట్నంలో సిఐటియు జాతీయ మహాసభ నిర్వహిస్తున్నట్లు ఆ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు ఎ.వి.నాగేశ్వరరావు తెలిపారు. ఆదివారం స్థానిక ఎన్‌పిఆర్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సిఐటియు జాతీయ మహాసభ వాల్‌పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మహాసభకు దేశ వ్యాప్తంగా 2 వేల మంది ప్రతినిధులు, 10 దేశాల నుంచి కార్మిక సంఘాల నేతలు హాజరు కానున్నారన్నారు. జనవరి నాలుగో తేదీన లక్ష మందితో బహిరంగ సభ జరగనుందని తెలిపారు. ఈ నెల 27 నుంచి జనవరి రెండో తేదీ వరకు సాంస్కృతిక ఉత్సవాలు ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. సాంస్కృతిక ఉత్సవాలకు ప్రముఖ సినీ నటులు ప్రకాశ్‌రాజ్, సుద్దాల అశోక్ తేజ్, సింగర్ మంగ్లీ, మరి కొంతమంది హాజరు కానున్నారని వెల్లడించారు. విజయనగరం జిల్లా ప్రజలు, కార్మికులు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు, స్కీమ్ వర్కర్లు అధిక సంఖ్యలో పాల్గొని బహిరంగ సభను, సాంస్కృతిక ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు.

మహాసభలో కార్మికులను బానిసలుగా చేసే లేబర్ కోడ్లు రద్దు కోసం, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, స్కీమ్‌వర్కర్లను, కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్, డైలీవేజ్ కార్మికులను రెగ్యులరైజ్ చేయాలని, భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని, హమాలీ, ఆటో, ప్రయివేట్ ట్రాన్స్‌పోర్ట్ తదితర అసంఘటిత రంగ కార్మికులందరికీ సంక్షేమ పథకాలు అమలు చేయాలని, విద్య, వైద్యం ప్రభుత్వ రంగంలో కొనసాగించాలని, ఇపిఎఫ్ కనీస పింఛను నెలకు రూ.9 వేలు ఇవ్వాలని, ఒపిఎస్‌ను అమలు చెయ్యాలని, విద్యుత్ సవరణ చట్టాన్ని రద్దు చెయ్యాలని తీర్మానాలు చేయనున్నట్లు తెలిపారు. మహాసభకు అన్ని వర్గాల ప్రజలు, కార్మికులు సహాయ సహకారాలు అందించాలని కోరారు. సమావేశంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు కె.సురేష్, ఎపి కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షులు బి.కాంతారావు, కార్మికులు పాల్గొన్నారు.

104 ఉద్యోగుల సమస్యలపై విన్నపం

కంటోన్మెంట్ : 104 ఉద్యోగుల సమస్యలను పరిష్కరించే విధంగా ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు ఎ.వి.నాగేశ్వరరావును ఆ యూనియన్ నాయకులు కోరారు. ఆదివారం ఎన్‌పిఆర్ భవన్‌లో ఆయన్ను కలిసి సమస్యలను వివరించి, పరిష్కారం దిశగా కృషి చేయాలని విజ్ఞప్తిచేశారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జగన్ మోహన్, తదితరులు పాల్గొన్నారు.

స్క్రబ్ టైఫస్‌పై ఆందోళన వద్దు

కలెక్టర్ రామసుందర్ రెడ్డి

ప్రజాశక్తి-కంటోన్మెంట్

జిల్లాలో స్క్రబ్ టైఫస్‌పై ప్రజల్లో అనవసరమైన ఆందోళన లేకుండా పూర్తి అవగాహన కల్పించాలని కలెక్టర్ ఎస్.రామసుందర్‌రెడ్డి అధికారులకు సూచించారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. స్క్రబ్ టైఫస్‌పై సమగ్ర సమాచారం అందించిన కలెక్టర్ ప్రజలకు జాగ్రత్తలు, లక్షణాలు, చికిత్స గురించి తెలియజేశారు. సాధారణ లక్షణాలైన అకస్మాత్తుగా వచ్చే అధిక జ్వరం, తీవ్రమైన తలనొప్పి, శరీర నొప్పులు, అలసట, కళ్ల ఎర్రబడ్డట్టు కనిపించడం, దగ్గు, శ్వాసలో స్వల్ప ఇబ్బంది, వాంతులు, పొట్టలో అసౌకర్యం అనిపిస్తే వెంటనే చికిత్స తీసుకోవాలని సూచించారు. కాటు వచ్చిన చోట చిన్న నల్ల మచ్చ లేదా గాయం లాంటి బొట్టు కనిపిస్తుందని చెప్పారు. ఇది దుస్తుల కింద ఉండే భాగాల్లో ఎక్కువగా కనిపిస్తుందని తెలిపారు. సాధారణంగా నొప్పి ఉండదని తెలిపారు. శరీరంపై ఎర్రబడ్డ దద్దుర్లు, లింఫ్ నోడ్స్ వాపు, ఆహారం తినాలనిపించకపోవడం లాంటివి కూడా ఉంటాయని తెలిపారు. తగ్గని అధిక జ్వరం, శ్వాసలో ఇబ్బంది, మతిమరుపు, గందరగోళం, మూత్రం తగ్గడం లాంటివి సంభవిస్తే వెంటనే దగ్గర్లోని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాలకు వెళ్లి పరీక్ష చేయించుకుని, అక్కడ అందించే ఉచిత మందులతో పూర్తిగా నయమవుతుందని స్పష్టంచేశారు. గుర్తించిన వెంటనే వైద్యసేవలు పొందితే స్క్రబ్ టైఫస్ పూర్తిగా నయం అవుతుందని, ఇది భయపడాల్సింది కాదని చెప్పారు. జాగ్రత్తలు పాటించడం, లక్షణాలు కనిపించిన వెంటనే వైద్యులను సంప్రదించడం చాలా ముఖ్యమని కలెక్టర్ సూచించారు. గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది, వైద్య ఆరోగ్య సిబ్బంది గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలని, అనుమానాస్పద లక్షణాలు ఉన్న వారిని వెంటనే పిహెచ్‌సి, సిహెచ్‌సికి తరలించి చికిత్స అందించాలని ఆదేశించారు.

నేడు కలెక్టరేట్‌లో పిజిఆర్‌ఎస్

ప్రజాశక్తి-కంటోన్మెంట్

కలెక్టరేట్ ఆడిటోరియంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్‌ఎస్) కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు కలెక్టర్ ఎస్.రామసుందర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు కార్యక్రమం జరుగుతుందని, అన్ని శాఖల జిల్లా అధికారులు అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. సమస్యలకు సంబంధించి అర్జీలను అందజేయాలని చెప్పారు. అర్జీదారులు గతంలో ఇచ్చిన అర్జీలకు సంబంధించిన స్లిప్పును తీసుకురావాలని సూచించారు. కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



మాట్లాడుతున్న ఎమ్‌పి కలిశెట్టి అప్పలనాయుడు

వ్యక్తిగత విమర్శలు సరికాదు

ఎమ్‌పి కలిశెట్టి అప్పలనాయుడు

ప్రజాశక్తి-విజయనగరంకోట

సిఎం చంద్రబాబునాయుడుపై మాజీ సిఎం జగన్మోహన్‌రెడ్డి వ్యక్తిగత విమర్శలకు దిగడం సరికాదని ఎమ్‌పి కలిశెట్టి అప్పలనాయుడు ఖండించారు. ఆదివారం స్థానిక అశోక్ బంగ్లాలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలో ఉత్తమ సిఎం చంద్రబాబునాయుడేనని ప్రధానమంత్రితో సహా అనేకమంది అభినందిస్తుంటే, అలాంటి వ్యక్తిపై వ్యక్తిగత దూషణలకు దిగడం సరికాదని అన్నారు. టిడిపి వ్యవస్థాపకులు ఎన్‌టిఆర్ నుంచి చంద్రబాబు వరకు పార్టీ నాయకులను ఏనాడూ వ్యక్తిగత విమర్శలకు తావు లేకుండా క్రమశిక్షణతో నడిపిస్తున్నారని చెప్పారు. ప్రజలను డైవర్ట్ చేయడానికి ఇటువంటి విమర్శలు జగన్ చేస్తున్నారని ఆరోపించారు. నాలుగు గోడల మధ్య నలుగురు జర్నలిస్టులతో జగన్ మాట్లాడటం కాదని, ప్రజా సమస్యలపై అసెంబ్లీలో మాట్లాడడానికి రావాలని కోరారు. పార్లమెంట్ సమావేశాల్లో చీపురుపల్లి నుంచి రాజాం రైల్వేలైన్, విజయనగరం నుంచి నెల్లిమర్ల మీదుగా హడ్డుబంగి వరకు హైవేలైన్ గురించి ప్రస్తావించినట్లు వివరించారు. మహారాజా ప్రభుత్వ సంగీత, నృత్య కళాశాల కోసం కేంద్ర మంత్రిని కలిసి రూ.1.50 కోట్లు విడుదల చేయాలని కోరినట్లు చెప్పారు. సమావేశంలో టిడిపి నగర అధ్యక్షులు గంటా రవి, ప్రధాన కార్యదర్శి కోదండరాం, జి.అప్పారావు, యాదవ్ కార్పొరేషన్ డైరెక్టర్ ప్రసాదుల లక్ష్మీవరప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఎన్‌ఎంఎంఎస్ పరీక్ష

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జిల్లాలో ఆదివారం నిర్వహించిన నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్‌ఎంఎంఎస్) పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. జిల్లాలోని 3 రెవెన్యూ డివిజన్లలో 19 కేంద్రాల్లో నిర్వహించిన పరీక్షకు 4094 మంది విద్యార్థులకు గాను 4009 మంది (97.92 శాతం) హాజరయ్యారు. 85 మంది గైర్హాజరయ్యారు. పరీక్షా కేంద్రాలను జిల్లా విద్యాశాఖాధికారి యు.మాణిక్యం నాయుడు సందర్శించారు. ప్రశాంతంగా పరీక్ష జరిగిందని డిఇఒ తెలిపారు. మూడు ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు తనిఖీలు చేపట్టాయి.


పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న డిఇఒ మాణిక్యంనాయుడు

ధైర్యంగా ముందుకు సాగాలి

చైల్డ్‌వెల్ఫేర్ కమిటీ జిల్లా చైర్‌పర్సన్ హిమబిందు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

భయాన్ని జయించి, ధైర్యంగా ముందుకు సాగాలని ప్రముఖ సైకాలజిస్ట్, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ జిల్లా చైర్‌పర్సన్ జి.హిమబిందు విద్యార్థులకు సూచించారు. ఇటీవల జరిగిన ఆత్మహత్య ఘటనతో మానసికంగా భయానికి, ఆందోళనకు గురైన బిసి వెల్ఫేర్ హాస్టల్ విద్యార్థినుల్లో మానసిక ధైర్యం నింపాలనే ఉద్దేశంతో హాస్టల్‌ను ఆదివారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంలో విద్యార్థినులతో ఆమె మాట్లాడుతూ భావోద్వేగాలను దాచకుండా ఓపెన్‌గా మాట్లాడటం, సపోర్ట్ తీసుకోవడం, సమస్యలను పాజిటివ్‌గా ఎదుర్కోవడం ఎంత ముఖ్యమో ఉదాహరణలతో వివరించారు. జరిగిన ఘటన దురదృష్టకరమని, ముందుగా తమలాంటి మనోవైజ్ఞానికుల సహాయం తీసుకుంటే నష్టాన్ని నివారించేందుకు సహాయ పడగలమని చెప్పారు. విద్యార్థినులు ఇలాంటి సంఘటనలు తమ భవిష్యత్తు, విద్య మీద ప్రభావం చూపకుండా ధైర్యం, ఆత్మవిశ్వాసం పెంచుకోవాలని కోరారు. హాస్టల్ విడిచి వెళ్లకుండా సంరక్షణ, ప్రోత్సాహక వాతావరణంలో ఉండాలని సూచించారు. కార్యక్రమంలో వార్డెన్ జి.కృష్ణవేణి, సిబ్బంది పాల్గొన్నారు.




విద్యార్థులతో మాట్లాడుతున్న చైల్డ్‌వెల్ఫేర్ కమిటీ జిల్లా చైర్‌పర్సన్ హిమబిందు

రహదారి భద్రత నియమాలు పాటించాల్సిందే : ఎస్‌పి

కంటోన్మెంట్ : రహదారి భద్రత నియమాలు తప్పనిసరిగా పాటించాలని ఎస్‌పి ఎఆర్ దామోదర్ ప్రజలను కోరారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. వాహనదారులు వాహన ధ్రువపత్రాలన్నీ కలిగి ఉండాలని స్పష్టంచేశారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించే విధంగా చూడాలని కోరారు. హెల్మెట్ ధరించడం వల్ల కలిగే ప్రయోజనాలను, ప్రమాదాలు జరిగినప్పటికీ స్వల్ప గాయాలతో ఎలా ప్రాణాలతో భయటపడవచ్చునో ద్విచక్ర వాహనదారులకు వివరించాలని పోలీసు అధికారులకు సూచించారు. ప్రతిరోజూ విజిబుల్ పోలీసింగ్ నిర్వహించాలని, వాహన తనిఖీలు చేపట్టి, ప్రజలకు, వాహనదారులకు రహదారి భద్రత, మోటారు వాహన చట్టం గురించి అవగాహన కల్పించాలని చెప్పారు.

హిందీ మంచ్ జిల్లా అధ్యక్షులుగా శ్రీనివాసరావు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్



హిందీ మంచ్ సంస్థ జిల్లా అధ్యక్షులుగా ఏలూరి శ్రీనివాసరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. హిందీ మంచ్ సంస్థ జిల్లా శాఖ ఎన్నికలు ఆదివారం స్థానిక ఫూల్‌బాగ్ లోని సరస్వతి శిశు మందిర్‌లో జరిగాయి. ప్రధానకార్యదర్శిగా నందివాడ చిన్నాదేవి, గౌరవాధ్యక్షులుగా పి.ఉమాబాల, సహాధ్యక్షులుగా భోగరాజు సూర్యలక్ష్మి ఎన్నికయ్యారు. మంచ్ ఉత్తరాంధ్ర కార్యదర్శి కోనే శ్రీధర్ ఎన్నికల సమన్వయకర్తగా వ్యవహరించారు. ముఖ్య సలహాదారుగా కుసుమంచి సుబ్బారావు, గౌరవ సలహాదారుగా ధవళ సర్వేశ్వరరావు ఎన్నికయ్యారు.

ప్రజాశక్తి
www.prajasakti.com



రిలే నిరాహారదీక్ష చేస్తున్న దళితులు

కొనసాగుతున్న దళితుల రిలే నిరాహారదీక్ష

ప్రజాశక్తి - భోగాపురం

మండలంలోని ముంజేరు దళితులు చేస్తున్న రిలే నిరాహార దీక్ష ఆదివారం కొనసాగింది. వీరికి వివిధ దళిత సంఘాలు మద్దతు తెలిపాయి. దళితులంతా ఏకమై ఐక్యతగా ఉన్నప్పుడే తమపై జరిగిన దాడులను ఎదుర్కొగలమని భీమ్‌సేన అధ్యక్ష, కార్యదర్శులు చిన్నారావు, వసంత రాజేంద్రప్రసాద్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఎదుట దళితులు చేస్తున్న రిలే నిరాహార దీక్షకు విశాఖ భీమ్‌సేన నాయకులు, కార్యవర్గ సభ్యులు మద్దతు తెలిపారు. ముంజేరు పంచాయతీ, సిద్ధార్థ కాలనీ దళితులకు మురికి కాలువ విషయంలో అన్యాయం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. కాలువ నిర్మాణ విషయంలో ఉత్తర్వులు ఉన్నప్పటికీ అధికారులు నిబంధనలను తుంగలో తొక్కారని విమర్శించారు. ముంజేరు దళితులకు న్యాయం జరిగే వరకూ పోరాటం కొనసాగుతుందని హెచ్చరించారు. ఈ దీక్షలో నెల్లిమర్ల బిఎస్‌పి ఇంచార్జ్ ఎరుకొండ వెంకటరావు పాల్గొన్నారు.



యంత్రం ద్వారా నూర్పుడు చేస్తున్న రైతులు

వరి నూర్పుల్లో రైతులు బిజీ

ప్రజాశక్తి - వేపాడ

మండలంలో పలు గ్రామాల్లో రైతులు వరి నూర్పు పనుల్లో బిజీ బిజీగా ఉన్నారు. ఇంతవరకు తుపాను హెచ్చరికలతో కల్లాల్లో కుప్పలుగా వేసిన వరి పంటను తుపాను ప్రభావం లేదని తెలుసుకుని ఇప్పుడు నూర్పులు వేసుకుంటున్నారు. దీంతో ప్రతి కల్లంలో యంత్రాలను పెట్టి నూర్పులు వేస్తూ రైతు బిజీగా కనిపిస్తున్నాడు.

నేడు కోటి సంతకాల సేకరణ

ప్రజాశక్తి - వేపాడ

ఎల్‌కోట మండలంలోని గోల్డ్ స్టోన్ జంక్షన్ వద్ద సోమవారం వైసిపి ఆధ్వర్యంలో కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని వైసిపి మండల అధ్యక్షులు ఎం.జగన్నాథం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు హాజరవుతారని మండలంలోని వైసిపి నాయకులంతా హాజరవ్వాలని కోరారు.

ప్రమాదాల నివారణకు ప్రత్యేక గస్తీలు

ప్రజాశక్తి - చీపురుపల్లి



పత్రాలను పరిశీలిస్తున్న ఎస్ఐ

రహదారి ప్రమాదాల నివారణకు పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రత్యేక గస్తీలను ఏర్పాటు చేసి ముమ్మరంగా వాహనాలు తనిఖీ చేస్తున్నామని ఎస్ఐ ఎల్.దామోదర్ రావు అన్నారు. ఆదివారం పట్టణ పరిధిలోని గరివిడి, లావేరు, రాజాం ప్రధాన మార్గాలలో వాహనాలను ముమ్మరంగా తనిఖీ చేశారు. ప్రత్యేకించి ద్విచక్ర వాహనాలను మైనర్లకు ఇవ్వడం వల్ల ఎక్కువ శాతం ప్రమాదాలు జరుగుతున్నాయని వాటి నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టామన్నారు. హెల్మెట్లు లేకపోవడం వల్ల ప్రమాదాలు జరిగిన వెంటనే ప్రాణాలు కోల్పోవలసిన పరిస్థితి ఏర్పడుతుందన్నారు. ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్లు, వాహనానికి సంబంధించిన రికార్డులు లేని పక్షంలో అపరాధ రుసుములు విధిస్తున్నామన్నారు. ఆటోలు ఓవర్ లోడ్ కారణంగా జరిగే ప్రమాదాలు పట్ల ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పిస్తూ నిబంధనలకు విరుద్ధంగా నడిపిన ఆటోలు పైన కేసులు నమోదు చేస్తున్నామన్నారు. అనుమానాస్పద వ్యక్తులు ఎక్కడైనా సంచరిస్తే స్థానికులు పోలీసులకు సహకరించి సమాచారం అందజేయాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

సహస్ర శ్లోక రామాయణ పారాయణం

ప్రజాశక్తి - నెల్లిమర్ల

రామతీర్థం రామస్వామి దేవస్థానంలో సహస్ర శ్లోక రామాయణ పారాయణం, ప్రాత:కాలార్చన, బాలభోగం, యాగశాలలో సుందరకాండ హావనం ఆదివారం అర్చకులు నిర్వహించారు. ఉత్సవ మూర్తులు వద్ద స్వామికి నిత్యకళ్యాణం తర్వాత భగవత్ రామానుజదాస బృందం భక్తులచే సహస్ర శ్లోక రామాయణం 72వ, శ్రీమన్నారాయణ వైభవం 70 అవృత్తి పారాయణం జరిపారు. సహస్ర శ్లోకరామాయణం, శ్రీరామాయణ పారాయణం సింహాచలం, శ్రీకూర్మం, పద్మనాభం దివ్య క్షేత్రలలో పారాయణం చేశామని భగవత్ రామానుజ దాస బృంద సభ్యులు శ్రీమాన్ కందాల రాజగోపాలాచార్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సహాయ కమిషనర్, కార్యనిర్వాహనాధికారి వై. శ్రీనివాసరావు ప్రసాదం ఏర్పాట్లు చేశారు.

రిక్షా కార్మికులకు దుస్తులు వితరణ

ప్రజాశక్తి - చీపురుపల్లి

పట్టణ పరిధిలోని రెడ్డిపేట సత్యసాయి బాలవికాస్ విద్యార్థులు సుమారు 9 మంది తాము దాచుకున్న డబ్బులతో రిక్షా కార్మికులు 22 మందికి తువ్వాళ్ళు, దుప్పట్లు, కొనుగోలు చేసి ఆదివారం పంపిణీ చేశారు. బాల వికాస్ గురువు భవాని సారధ్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సత్యసాయి సమితి కన్వీనర్ ఏవి.రవిప్రసాద్, సమితి సమన్వయకర్తలు శ్రీధరమూర్తి, దిలీప్, భవాని సీనియర్ సభ్యులు సీతరాజు, యూత్ సభ్యుడు అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సర్పంచ్‌కు పరామర్శ

ప్రజాశక్తి- సంతకవిటి

మండలంలోని కొండగూడెం సర్పంచ్ తెంబూరు అప్పలనాయుడు ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి, కాలుకు శస్త్రచికిత్స అనంతరం ప్రస్తుతం హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న రాజాం నియోజకవర్గ వైసిపి ఇంఛార్జి తలే రాజేష్ హాస్పిటల్‌కు వెళ్లి ఆయనను పరామర్శించారు. ఈ మేరకు సర్పంచ్ త్వరగా కోలుకోవాలని నాయకులు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ సిరిపురపు జగన్మోహన్ రావు, రాజాం నియోజకవర్గ పరిశీలకులు కెవి. సూర్యనారాయణ రాజు, మాజీ వైస్ ఎంపిపి గంధ్రేటి కేసరి, యువజన విభాగం అధ్యక్షులు వావిలపల్లి రమణ రావు, తదితరులు పాల్గొన్నారు.

జలపాతంలో పడి యువకుడు మృతి

ప్రజాశక్తి-సాలూరు



హరి (ఫైల్)

మండలంలోని కురుకూటి సమీపంలో ఆదివారం అడపరాయి జలపాతంలో పడి యువకుడు దుర్మరణం చెందాడు. రామభద్రపురంలోని మారుతీనగర్‌కు చెందిన గర్భాపు హరి(24) మరి కొంతమంది యువకులతో కలిసి జలపాతానికి చేరుకున్నాడు. అక్కడ విపరీతమైన రద్దీ ఉండడంతో జలపాతం దిగువున యువకులంతా కలిసి స్నానం చేస్తున్నారు. హరి లోతు ఎక్కువ ఉన్న ప్రాంతానికి వెళ్లటంతో బయటకు రాలేకపోయాడు. చివరికి నీటిలో మునిగి అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న సాలూరు రూరల్ పోలీసులు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని వెలికి తీశారు. పోస్టుమార్టం నిమిత్తం సాలూరు ఏరియా ఆసుపత్రికి తరలించినట్లు రూరల్ ఎస్ఐ నరసింహమూర్తి తెలిపారు.

బాబు గారూ..! జీతాలు ఇవ్వండి

◆ గ్రీన్ అంబాసిడర్లకు నెలల తరబడి బకాయిలు ◆ జిఒ 680 అమలు చేయాలని డిమాండ్ ◆ పనిముట్లు అందజేయాలని వేడుకోలు



గ్రామంలో చెత్తను సేకరిస్తున్న గ్రీన్ అంబాసిడర్

ప్రజాశక్తి - సంతకవిటి

గ్రామాల్లో పరిశుభ్రత కోసం ప్రతిరోజూ చెత్త సేకరణ, తరలింపు, చెత్త సంపద కేంద్రాల్లో విభజన వంటి కష్టతరమైన పనులు చేస్తూ ప్రజల ఆరోగ్యం కోసం ముందంజలో నిలుస్తున్న గ్రీన్ అంబాసిడర్లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మొత్తం 65 మంది కార్మికులు మండల వ్యాప్తంగా సేవలందిస్తున్నప్పటికీ, గత కొన్ని నెలలుగా జీతాలు నిలిపివేయడంతో వారి కుటుంబాలు కష్టాల్లో కూరుకుపోయాయి.

పని చేస్తున్నా జీతాలు రావడం లేదు

తడి, పొడి చెత్త విడిగా సేకరించడం, గ్రామాల్లో చెత్త తొలగిస్తున్నా కొంతమంది విమర్శలు, ఆరోపణలు, కొన్నిసార్లు వేధింపులు కూడా భరించాల్సి వస్తోందని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నెలల తరబడి బకాయిలు పెండింగ్ ఉండడంతో కొంతమంది ఉద్యోగం మానేసినా, వారి బకాయిలు ఇప్పటికీ విడుదల కాలేదని ఆరోపిస్తున్నారు.

రక్షణ పరికరాలు లేకుండా ప్రమాదకర పనులు

మురుగు, చెత్తల్లో పనిచేసే వీరికి ప్రభుత్వం కనీస రక్షణ పరికరాలు కూడా ఇవ్వలేదు. ఇప్పటికీ గ్లౌజులు, షూలు లేకుండా పనులు చెయ్యక తప్పడం లేదు. కొన్ని గ్రామాల్లో ట్రైసైకిళ్లు పూర్తిగా శిథిలావస్థకు చేరినా మరమ్మతులకు అధికారులు మొగ్గు చూపడం లేదు.

పంచాయతీలకే బాధ్యత మరింత వేధింపులకేనా?

జీతాల బాధ్యతను పంచాయతీలకు బదిలీ చేసిన తర్వాత పరిస్థితి మరింత దారుణంగా మారిందని కార్మికులు చెబుతున్నారు. సర్పంచులు, సెక్రటరీల చేత వేధింపులు పెరిగాయని ఆరోపిస్తున్నారు. కొంతమంది సెక్రటరీలు తమ సొంత డబ్బుతో కార్మికులకు కొంత మొత్తం చెల్లిస్తుంటే, మరి కొంతమంది సెక్రటరీలు బ్యాంక్ ఖాతాలు లేవని కారణం చూపుతూ సగం జీతం మాత్రమే ఇస్తున్నారని చెబుతున్నారు.

జీతాలు నేరుగా ఖాతాల్లోకే జమ చేయాలి

రాష్ట్ర ప్రభుత్వం రూ.548.28కోట్లు 15వ ఆర్థిక సంఘం నిధులు విడుదల చేసినట్లు పంచాయతీరాజ్ అండ్ గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ ప్రధాన కార్యదర్శి శశిభూషణ్ కుమార్ ఉత్తర్వులు జారీ చేసినా, కార్మికులకు అరకొర జీతాలు పడటంతో పలువురు బహిరంగానే విమర్శిస్తున్నారు. కార్మికులకు నెలకు 6వేలు జీతంతో పాటు ఆరోగ్య భత్యం 4వేలు రూపాయలు అదనంగా ఇవ్వాలని ఐఎఎస్ అధికారి, కమిషనర్ పిఆర్ అండ్ ఆర్ డివి.ఆర్ కృష్ణ తేజ మైలవరపు ఉత్తర్వులు జారీ చేసినప్పటికి, నేటికి అమలు కాని పరిస్థితి నెలకొంది. ప్రతి నెలా క్రమం తప్పకుండా చెల్లింపులు జరిగేలా నివేదిక ఇవ్వాలని అధికారులకు తెలియజేసినప్పటికి నేటికి అమలు కావడం లేదు. కనీసం జీవో నెం. 680 ప్రకారం కనీసం రూ.10వేలు గౌరవ వేతనం ఇవ్వాలని కార్మికులు డిమాండ్ చేస్తున్నారు. కార్మికుల జీతాలను నేరుగా తమ ఖాతాల్లో జమ చేసే విధానం అమలు చేయాలని కోరుతున్నారు. ఉద్యోగ భద్రతతో పాటు ఇఎస్ఐ, పిఎఫ్ వంటి ప్రాథమిక సదుపాయాలు అమలు చెయ్యాలని ప్రభుత్వానికి కోరుతున్నారు. మృతి చెందిన కార్మికులకు ఐదు లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని, కుటుంబంలో ఒకరికి ఉపాధి కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు.

స్వచ్ఛమైన గ్రామాల కోసం రాత్రీపగళ్లు శ్రమిస్తున్న గ్రీన్ అంబాసిడర్ల సమస్యలు ప్రభుత్వ దృష్టికి ఎప్పుడు చేరుతాయో, కార్మికుల కుటుంబాలు సాధారణ జీవితానికి ఎప్పుడు తిరిగి చేరుతాయోనని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తక్షణమే పెండింగ్ బకాయిలు విడుదల చేసి, సమస్యలు పరిష్కారం చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

సమస్యలు పరిష్కరిస్తాం

2023-24లో బకాయిలు అనివార్య కారణాలవల్ల పెండింగ్ లో ఉన్నాయి. ఈ సంవత్సరంలోని సెప్టెంబర్ నెల వరకు బకాయిలు ఇచ్చాం. పెండింగ్ జీతాలు త్వరలో ఇస్తాం. ప్రతి కార్మికుడుకు రక్షణ పరికరాలు అందిస్తాం. వారి సమస్యలు కూడా దఫాల వారీగా పరిష్కరిస్తాం.

కె. సురేష్ కుమార్, ఎంపిడిఒ

మురుగు కంపులో పని చేస్తున్నాం



గ్రామంలోని మురుగు కంపులో పని చేస్తున్నాం. నెలలు తరబడి జీతాలు ఇవ్వలేదు. మా కుటుంబం రోడ్డుపై పడినా ప్రభుత్వం పట్టించుకోవడంలేదు. తక్షణమే ప్రభుత్వం స్పందించి జీతాలు ఇవ్వాలని కోరుతున్నాం.

పి.సీతారాం, గ్రీన్ అంబాసిడర్ కార్మికుడు జావాం

4వేలు హెల్త్ అలవెన్స్ ఇవ్వాలి



గ్రీన్ అంబాసిడర్ కార్మికులకు నెలలు తరబడి బకాయి జీతాలు విడుదల చేయాలి. కనీసం వేతనం 18వేలు రూపాయలు అమలు చేయాలి. ప్రభుత్వం రక్షణ పరికరాలు పంపిణీ చేయాలి. కార్మికులకు పిఎఫ్, ఈఎస్ఐ అమలు చేయాలి. 4వేలు రూపాయల హెల్త్ అలవెన్స్ వెంటనే అమలు చేయాలి. రాజకీయ వేధింపులు ఆపాలి. జనాభా కనుగుణంగా కార్మికుల సంఖ్య పెంచాలి. మరణించిన కార్మికుల కుటుంబ సభ్యులకు ఉపాధి కల్పించాలి. 5 లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి

కాకి సురేష్, సిఐటియు జిల్లా అధ్యక్షులు, విజయనగరం

12 నెలల బకాయి



ప్రభుత్వాలు మారినా మా బతుకులు మారటం లేదు. నాకు 12 నెలలుగా జీతాలు చెల్లించాలి. జీతాలు రాకపోవడంతో మా కుటుంబాలు రోడ్డున పడ్డాయి. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి బకాయి జీతాలు ఇవ్వాలి.


వై.అచ్యుతరావు, గ్రీన్ అంబాసిడర్, మండవకురిటి

బియ్యం బొక్కేశారు..

●పౌరసరఫరాల సంస్థలో భారీ అవినీతి
● దొంగతనానికి గురైన బియ్యం
●శిక్ష మాత్రం అమాయక దళిత ఉద్యోగికి.!

ప్రజాశక్తి- రాజాం

రాజాం పౌరసరఫరాల సంస్థలో భారీ అక్రమాలు వెలుగులోకి వస్తున్నాయి. పేదల కోసం ప్రభుత్వం ఉచితంగా పంపిణీ చేస్తున్న బియ్యం, చిన్నారులు, గర్భిణుల కోసం ఇచ్చే పోషకాహార సరుకులను గోదాం ఇంచార్జి శ్రీనివాసరావు పక్కదారి పట్టిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా లక్షలాది రూపాయలు విలువ చేసే బియ్యం బస్తాలను బొక్కేసినట్లు తెలిస్తోంది. కాసులకు కక్కుర్తి పడి పేదల బియ్యాన్ని పక్కదారి పట్టిస్తున్న గోదాం ఇంఛార్జి అవినీతి నుంచి తప్పుకుని అమాయక దళిత ఉద్యోగిని బలి చేసినట్లు తెలిస్తోంది. ఫలితంగా అధికారులు అవినీతితో ఎటువంటి సంబంధం లేని ఆ దళితుడుకు సోకాజ్ నోటీసులు జారీ చేయడంతో దళిత వర్గాల్లో కలకలం రేగింది.



రాజాం ఎంఎల్ఎస్ పాయింట్ ఆఫీసు

రాజాం ఎంఎల్ఎస్ పాయింట్‌లో మొత్తం 17 మంది స్టాఫ్, ఒక స్వీపర్, నలుగురు డ్రైవర్లు పనిచేస్తున్నారు. ఈ గోదాం నుంచి రాజాం ప్రాంతంలోని డీలర్ షాపులకు, అంగన్‌వాడీ కేంద్రాలకు ప్రభుత్వం తరుపున బియ్యం సరఫరా చేస్తారు. ఈ బియ్యం బస్తాలు, సరుకులు నిల్వ ఉండే గోదాం తాళాలు తీసిన నుండి వేసే దాకా ఇంచార్జి శ్రీనివాసరావు వద్దే ఉంటాయి. గోదాం పర్యవేక్షణ అంతా తానే చూసుకొనేవాడు. ప్రతి రోజు స్టాక్ ఎంత ఉందో చెక్ చేద్దామన్నా ప్రస్తుతం టైమ్ లేదు అని తాళాలు వేసేసేవాడు అని ఉద్యోగులు చెబుతున్నారు. తనకు చాలా మంది రైస్ మిల్లర్లు తెలుసు అని ఎన్ని బస్తాలైనా పెట్టుకుంటాను మీకెందుకు అని ఉద్యోగులను బెదిరించేవాడు. జిల్లాలోని కూటమి నాయకులు అండదండలు శ్రీనివాసరావుకు పుష్కలంగా ఉండడంతో ఇష్టానుసారంగా వ్యవహరిస్తూ బియ్యం బస్తాలను అమ్మేసేవాడని ఉద్యోగులు ఆరోపిస్తున్నారు.

580 బస్తాలు మాయం

గోదాంలో ఉన్న బియ్యం బస్తాలను మధ్యాహ్న భోజనం విరామ సమయంలో ఎవరు లేని టైమ్ చూసి బయటకు తరలించేవాడు. ఇలా తరలిసుతన్న తరుణంలో స్వీపర్ గుర్తించి ప్రశ్నించగా ఉద్యోగం తీసేస్తాం అంటూ బెదిరించాడని స్వీపర్ తెలిపారు. ఇప్పటి వరకూ ఇలా 580 బియ్యం బస్తాలను బయటకు తరలించి సుమారు రూ.28లక్షలకు బ్లాక్ మార్కెట్‌లో అమ్మేసుకున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ విషయం ఆ నోటా ఈ నోటా బయటకు పొక్కడంతో అధికారులు విచారణ చేపట్టారు.

తప్పించుకున్న గోదాం ఇంఛార్జి.. బలైన దళిత ఉద్యోగి

అసలు అవినీతి చేసిన గోదాం ఇంచార్జి శ్రీనివాసరావు ఇప్పటికే పరారైనట్టుగా సమాచారం. దీంతో కంప్యూటర్ ఆపరేటర్ అయిన దళిత ఉద్యోగి బోనెల శోభనబాబుపై నిందలు మోపి అతనికి అధికారులు సోకాజ్ నోటు జారీ చేశారు. దీంతో గోదాం ఉద్యోగ, కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిజ నిర్ధారణ లేకుండా ఓ దళిత ఉద్యోగిపై చర్యలు తీసుకోవడం అన్యాయమని, వెంటనే అధికారులు నిష్పక్షపాత ధర్యాప్తు చేయాలి అని వారు డిమాండ్ చేస్తున్నారు.

దళితుడననే సోకాజ్ నోటీసు ఇచ్చారు

నేను ఎంఎల్ఎస్ పాయింట్‌లో కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేస్తున్నాను. నేను దళిత ఉద్యోగి కావడంతో నాపై నిందలు వేశారు. ఆర్ఒ ప్రకారం ఎంట్రీలు చేసి బస్తాలు బయలుదేరగానే వెంటనే పై అధికారులకు, డీటీకు సమాచారం ఇచ్చేవాణ్ని. నాకు ఎలాంటి సంబంధం లేకుండా నాపై సోకాజ్ నోటీసు జారీ చేయడం అన్యాయం. గోదాం తాళాలు నిత్యం ఇంచార్జి వద్దే ఉండేవి. స్టాక్ చెక్ చేద్దామన్న అవకాశం ఇచ్చేవాడు కాదు. ఈ అక్రమాలకు నాకు ఎటువంటి సంబంధమూ లేకపోయినా అధికారులు నాపై వివక్ష చూపారు. తక్షణమే అక్రమార్కుడు పై చర్యలు తీసుకోవాలి.

- బోనెల శోభనబాబు (కంప్యూటర్ ఆపరేటర్), రాజాం



నిత్యావసరాలను అందిస్తున్న ప్రతినిధులు

నిత్యావసరాలు పంపిణీ

ప్రజాశక్తి - కొత్తవలస

మండల కేంద్రంలోని తుమ్మికాపల్లి గ్రామం వద్ద ఫర్ద పీపుల్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ విశ్వనాథ హరికుమార్ ఆధ్వర్యంలో 45 మంది ఒంటరి వృద్ధులకు ఆదివారం 12 రకాల నిత్యవసర సరుకులు పంపిణీ చేశారు. రైల్వే రిటైర్డ్ ఎంప్లాయ్ రమణ, జాయింట్ సెక్రెటరీ డాక్టర్ రవి పాల్గొని అన్నదానం చేశారు. ట్రస్ట్ చైర్మన్ విశ్వనాథ హరికుమార్ మాట్లాడుతూ స్వర్గీయ రాజులమ్మ కుమార్తె రత్నకుమారి ఆర్థిక సహాయంతో అన్నపూర్ణ ఫౌండేషన్ సహకారంతో వృద్ధులకు అన్నదానం చేశామన్నారు. ప్రతి నెలా దాతల సహకారంతో వృద్ధులకు నిత్యావసరాలు, అన్నదానం చేస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ ట్రెజరర్ శ్రావణ్ కుమార్, సభ్యులు గణేష్, నగేష్, గీతిక, ధను, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు పూర్వ విద్యార్థుల వితరణ

ప్రజాశక్తి- మెరకముడిదాం

మండలంలోని గర్భాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1992-93 పదో తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థులు పాఠశాలకు సుమారు రూ.25వేలు విలువ చేసే 10 ఫ్యాన్లు, 40 ట్యూబ్ లైట్స్, 5 ఫ్లడ్ లైట్స్ వితరణగా అందించారు. ముందుగా పాఠశాలకు వాగ్దానం చేసిన విదంగా పూర్వపు విద్యార్థులు అందరూ కలసి పాఠశాలను సందర్శించి ఆదివారం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్న సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు ఉమా టీచర్, హేమలత టీచర్‌కు ఫాన్స్ లైట్స్ అందజేశారు. పాఠశాల పూర్వ విద్యార్థులు టీవీవీఎల్ నరసింహం, స్వామి నాయుడు విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ ఈ 100 రోజులు ప్రణాళిక బద్ధంగా చదివి 10వ తరగతిలో మంచి మార్కులు తెచ్చుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులను హెచ్ఎం బి.సూర్యనారాయణ, ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు. ఈ కార్యక్రమంలో పూర్వపు విద్యార్థులు సావు శంకరరావు, పల్లి సత్యనారాయణ, చెల్లూరి శ్రీను, మురళీ కృష్ణ, జమ్ము శ్రీను, రెడ్డి సత్యనారాయణ పాల్గొన్నారు.



సామగ్రిని వితరణగా అందిస్తున్న విద్యార్థులు

రైతులను బెదిరిస్తే ఊరుకోం

ప్రజాశక్తి- బాడంగి

ప్రభుత్వం నిర్ణయించిన దానికంటే అదనంగా ధాన్యం ఇవ్వాలని రైతులను బెదిరిస్తే ఊరుకోమని రైతు సంఘం జిల్లా అధ్యక్షులు సింగిరెడ్డి గోపాలం హెచ్చరించారు. మండలంలో డొంకినవలస వెంకట పద్మావతి మోడరన్ రైస్ మిల్లు వద్ద ఆదివారం రైతులతో కలిసి ఆయన ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలం చుట్టూ పక్కల గ్రామాల నుండి రైతులు ఆర్ఎస్‌కె ద్వారా ట్రక్ సీటు తీసికొని ఈ మిల్లుకు వస్తే ధాన్యం ముక్కల వుతున్నాయని 100 కేజీలకు బదులు 110 కేజీలు ఇస్తేనే అన్లోడ్ చేస్తామని లేకపోతే చేయమని రైతులను బెదిరించడం పద్ధతి కాదన్నారు. ఎమ్మెల్యే, అధికారులు రైతులను మోసం చేయొద్దని, అధిక ధాన్యం తూకవ చేయొద్దని ప్రకటనలు చేసినప్పటికీ రైస్ మిల్లు యాజమాన్యాలు 100 కేజీలకు అదనంగా 10 కేజీలు తూయించుకుంటున్నారని, ఎక్కువ ధాన్యం ఇవ్వకపోతే తిరిగి ధాన్యం పంపించేస్తున్నారని రైతులు సిపిఎం నాయకులు వద్ద రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపైన జిల్లా, మండల అధికారులు తక్షణమే జోక్యం చేసుకొని రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. సంపత్ ధాన్యం ముక్కలుగా వస్తున్నాయని అందుకే అదనంగా ధాన్యం తీసుకుంటున్నామని మిల్లు యాజమాన్యం సమాధానం చెప్పడం గమనార్హం. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు వై. మురళీ, సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు పి.శంకర్రావు, రైతులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న రైతులు, నాయకులు

రైతులు ఇబ్బందులు పడకుండా చర్యలు

బొబ్బిలి: ధాన్యం రైతులు ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే బేబినాయన చెప్పారు. కోటలో ఆదివారం ఆయన మాట్లాడుతూ ధాన్యం మిల్లింగ్ చేస్తే బియ్యం ముక్కలు అవుతుందని కారణంతో మిల్లర్లు క్వింటాలు దాన్యానికి 10కిలోలు వరకు అదనంగా తీసుకుంటున్నట్లు రైతులు చెపుతున్నారని చెప్పారు. రైతులు ఇబ్బందులు పడకుండా ధాన్యం కొనుగోలు చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్‌ను కోరినట్లు చెప్పారు. రైతులను ఇబ్బందులకు గురి చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

177వ రోజుకు జిందాల్ బాధితుల నిరసన

ప్రజాశక్తి- శృంగవరపుకోట

జిందాల్ పరిశ్రమ కోసం భూములు త్యాగం చేసి, ఉపాధి కరువై రోడ్డున పడ్డ నిర్వాసితుల పోరాటం 177 రోజులుగా కొనసాగుతుందని సిపిఎం నాయకులు చల్లా జగన్ తెలిపారు. ఆదివారం బొడ్డవర నిర్వాసితులతో చల్లా జగన్ మాట్లాడుతూ కేవలం అధికారుల నిర్లక్ష్యం వల్లే తాము ఇంకా రోడ్లపైనే ఉండాల్సి వస్తోందన్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు తమకు అండగా నిలవడం లేదని, తమ సమస్యకు ఎవరూ ప్రాతినిధ్యం వహించడం లేదని ఆరోపించారు. భూములు కోల్పోయి, ఉపాధి లేక బతుకు భారంగా మారిన తమకు సీఎం చంద్రబాబు నాయుడు న్యాయం చేస్తారన్న నమ్మకంతో, ఆయన్నే నేరుగా కలిసి తమ సమస్య తెలియజె ప్పాలని నిర్ణయించుకున్నట్లు నిర్వాసితులు తెలిపారు. తమకి న్యాయం జరిగే వరకూ తమ నిరసనలు, నిరాహార దీక్షలు కొనసాగుతాయని స్పష్టం చేశారు.



నిరసన తెలుపుతున్న జిందాల్ బాధితులు

అర్ధరాత్రి దొంగ హల్‌చల్

ప్రజాశక్తి- రాజాం

పట్టణంలో శనివారం అర్ధరాత్రి దొంగ రెచ్చిపోయాడు. స్థానిక తిరుమల కాంప్లెక్స్‌లో తాళాలు వేసి ఉన్న రెండు సెల్ పాయింట్లు, టైలరింగ్ షాప్‌లోకి చొరబడి దొంగతనం చేశాడు. ఎస్ఆర్ సెల్ పాయి ంట్ క్యాష్ కౌంటర్‌లో ఉన్న తులం బంగారం, రూ.15 వేలు, జానీ సెల్ పాయింట్‌లో క్యాష్ కౌంటర్లో ఉన్న రూ.10 వేలు దోచు కున్నాడు. పక్కన ఉన్న టైలరింగ్ షాప్‌లో ఏమీ లేకపోవడంతో వస్తు వులన్నీ చిందర వందరగా పడేసి పరారయ్యాడు. ఉదయాన్నే షాప్‌కి తాళాలు విరగొట్టి ఉండడంతో షాపు యజమానులు పోలీసులను ఆశ్రయించారు. సీసీటీవీ ఫుటేజ్ ఆధారంగా పోలీసులు పరిశీలించి, ఇచ్చిన ఫిర్యాదుపై సిఐ అశోకుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చోరీ కేసులో ఇద్దరు అరెస్టు

ప్రజాశక్తి-బొబ్బిలి

మండలంలోని పిరిడి శాంకరి మాత ధ్యాన మందిరంలో పుస్తెలతాడు, శతమానాలను గతనెల 5న చోరీ జరిగింది. చోరీ కేసులో దర్యాప్తు చేస్తుండగా సీతానగరం మండలానికి చెందిన పోల భాస్కరరావు, శ్రీకాకుళం జిల్లా హిరమండలానికి చెందిన సవర సూర్యంను ఎస్ఐ రమేష్ అరెస్టు చేసి చోరీ సొత్తును రికవరీ చేసి ఇద్దరిని రిమాండ్‌కు తరలించినట్లు పట్టణ సిఐ కె.సతీష్ కుమార్ చెప్పారు. లచ్చయ్యపేట ఎన్‌సిఎస్ చక్కెర కర్మాగారంలో ఉన్న ఆలయంలో జరిగిన చోరిను కూడా వీరే చేసినట్లు అంగీకరించినట్లు చెప్పారు. సిఐ సతీష్, ఎస్ఐ రమేష్‌ను డిఎస్‌పి భవ్యరెడ్డి అభినందించారు.

సిఎం సహాయనిధితో పేదలకు ఉపశమనం

ప్రజాశక్తి- శృంగవరపు కోట

సీఎం రిలీఫ్ ఫండ్ పేద, మధ్యతరగతి వర్గాలకు ఉపశమనంగా నిలుస్తుందని ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి అన్నారు. ఆదివారం లక్కవరపుకోటలో టిడిపి క్యాంప్ కార్యాలయం వద్ద బాధితులకు సహాయ నిధి చెక్కులను ఆమె పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నియోజకవర్గంలో ఇప్పటి వరకూ రూ.2.60 కోట్ల చెక్కులను పంపిణీ చేశామన్నారు. అనంతరం 20 మంది లబ్ధిదారులకు రూ.18.67 లక్షల విలువైన చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో దాసరి కార్పొరేషన్ చైర్మన్ పొట్నూరు వెంకట రత్నాజీ, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కోళ్ల బాలాజీ అప్పల రాంప్రసాద్, రాష్ట్ర కార్యదర్శి రాయవరపు చంద్ర శేఖర్, రాష్ట్ర నగరాల సేనల నానాజీ, దాసరి కార్పొరేషన్ డైరెక్టర్ గనివాడ బంగారు నాయుడు, టిడిపి మండల అధ్యక్షులు కరెడ్ల ఈశ్వరరావు, పిఎసిఎస్ ఛైర్మన్ జీ.ఎస్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.



చెక్కును అందిస్తున్న ఎమ్మెల్యే లలితకుమారి

లైఫ్ సర్టిఫికెట్లు ఆన్‌లైన్ చేయాలి

ప్రజాశక్తి-బొబ్బిలి

రాష్ట్ర ప్రభుత్వ పెన్షన్ దారులు, కుటుంబ పెన్షన్ దారులు 2026 పెన్షన్ కోసం జనవరి ఒకటి నుంచి ఫిబ్రవరి 28 లోగా లైఫ్ సర్టిఫికేట్స్ ఆన్‌లైన్ చేయాలని ఎస్‌టిఒ పివి పద్మనాభం ఆదివారం ఒక ప్రకటనలో చెప్పారు. 2025 నవంబర్, డిసెంబర్ నెలలో సమర్పించిన లైఫ్ సర్టిఫికెట్లు 2026కి చెల్లుబాటు కాదని చెప్పారు. ఉప ఖజానా కార్యాలయంలో లేదా జీవన్ ప్రమాణ యాప్ ద్వారా లైఫ్ సర్టిఫికెట్ సమర్పించవచ్చునన్నారు.

పిపిఒ నెంబర్, ఆధార్ నెంబర్, బ్యాంక్ అకౌంట్ నెంబర్, మొబైల్ నెంబర్ (ఒటిపి కోసం)తో ఉప ఖజానా కార్యాలయాన్ని సంప్రదించాలని కోరారు. సేవలు పూర్తిగా ఉచితమని, కార్యాలయానికి రాలేని వారు సమాచారమిస్తే ఇంటి వద్దకే వచ్చి లైఫ్ సర్టిఫికెట్ స్వీకరిస్తామని పద్మనాభం తెలిపారు.